


# ఇంటింటి కథ

ఓ.వి.ఆర్. భాస్కర్

"అంతాబాగానే వుంది కానీ, ఇంతకూ ఇప్పుడు మీ వూళ్లో పొలాలు ఎంత రేటు పలుకుతున్నాయంటారూ?" అన్న ఆడపెళ్లి వారి ప్రశ్నతో ఈ సంబంధం ఖాయమయి నట్టే అనుకుని కమ్మటి కాఫీ తాగుతూ రంగురంగుల కలలు కంటున్న నాకు ఒక్కసారిగా పొలమారినట్ల యింది. రియల్ ఎస్టేట్ బూమ్‌తో ఎక్కడెక్కడో నగర శివార్లలో ఒకప్పుడు ఎందుకూ పనికిరాని కొండలూ గుట్టలతో నిండివున్న భూముల ధరలు కూడా భగ్గున మండుతున్నప్పుడు విజయవాడకు కూతవేటు దూరంలో బైపాస్ రోడ్డు పక్కనే వున్న మా వూళ్లో సెంటు లక్ష, లక్షన్నర పలకడంలో ఆశ్చర్యమే ముంది? అయితే నాకు పొలమారింది అందుక్కాదు.

ఒకప్పుడు వందలాది ఎకరాల పొలం, చావడి నిండా పాడిగేదెలు, రెండంతస్తుల మేడ (చిన్నప్పుడు మా వూళ్లో మాదొక్కటే రెండంతస్తుల మేడ), జీతగాళ్లు, కమతగాళ్లతో మా ఇల్లు కళకళలాడిపోతుండేది. పండుగలు పబ్బాలు వచ్చాయంటే నాలుగయిదు రకాల పిండివంటలు చేసుకుని తిన్నంత తిని పనివాళ్లకు పందేరం చేసేవాళ్లం ఆరోజుల్లో. అప్పట్లో మాకున్న పొలంలో పదోవంతు కాదు కదా, కనీసం పాతికోవంతున్నా నేనీపాటికి ఎంచక్కా ఏ జూబిలీ హిల్స్‌లోనో, బంజారాహిల్స్‌లోనో ట్రిబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్, ఏసీకారుకు వోనర్షియ్యుండేవాణ్ణి కానీ, ఇట్లా పత్రికలకి కథలు, కాకరకాయలు రాసుకుంటూ, పారితోషికం కింద అడపాదడపా వచ్చే వందల్నే వేలల్లాగా ఖర్చుపెట్టుకుంటూ వుండేవాణ్ణి కాదేమో! అదేదో సినిమాలో బ్రహ్మానందం డైలాగులాగా ''అసలు మా తాతయ్యే అట్లా చేసి వుండకపోతేనా'' అనే డైలాగ్‌ను నేను తరచూ గుర్తుచేసుకుంటూ వుండవలసిన అగత్యం వుండేది కాదు. అనుకుంటూ వుండగానే నా బాల్యం అంతా ఒక్కసారిగా కళ్లముందు గిర్రున తిరిగింది.

★ ★ ★

''ఓం గంగేచ యమునేచైవ గోదావరీ కావేరీ సరస్వతీ నర్మదా సింధు జలేస్మిన్ సన్నిధిం కురు'' అంటూ అస్పష్టంగా చదూతూ మా తాతయ్య బావిలోంచి నాలుగు చేదల నీళ్లు తోడి నెత్తిన పోసుకుంటూనే ''కంచాలూ మంచి నీళ్లూ పెట్టండమ్మా'' అంటూ కోడళ్లకు పురమాయిస్తూ, జిర్రున ముక్కు చీది, నొసట కుంకుమ పెట్టుకుని దండెం మీంచి తువ్వాలు తీసి దఢాల్న దులిపి తలతుడుచుకొని పంచె కట్టుకునొచ్చి పూజగదిలోకెళ్లి దేవుడికి రెండు చేతులూ జోడిస్తూ 'మమోపాత్త దురితక్షయద్వారా శ్రీ పరమేశ్వర ముద్దిశ్య శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం ...సర్వేజనాస్సుఖినోభవంతు' అని సంకల్పం చెప్పుకుని, తూతూమంత్రంగా పూజ పూర్తి చేసేవారు.ఆ తర్వాత మాకోసం చుట్టూ చూస్తూ ''ఏమర్రా బారెడు పొద్దెక్కుతున్నా మీకు ఆకళ్లు కావట్లేదా ఇంక ఆ ఆటలు ఆపి భోయనాలకి రండి'' అంటూ మమ్మల్నందర్నీ కూకలేసేవారు. ''ఏమిటమ్మా ఇంకా అట్లా చూస్తూ నిలబడ్డారు? ఇక వడ్డన కానియ్యండి'' అంటూ కోడళ్ళని ప్రేమగా విసుక్కునేవారు. ''ఏమోయ్ ఇంతకూ వంట పూర్తయిందా లేదా'' అంటూ మా మామ్మ కాళ్లకింద నిప్పులు పోసేవారు.

''ఆఁ ఆఁ నా వంట ఎప్పుడో అయిపోయింది. దేవుడి నైవేద్యమే ఇంకా కాలేదు మరి...'' అంటూ అర్థోక్తిలో ఆగిపోయేది మామ్మ. ఎందుకంటే తన వంట పూర్తికాగానే వదినగారు నైవేద్యం పెట్టకుండా ఇంట్లో ఎవరూ కంచంలో చెయ్యిపెట్టడానికి వీల్లేదు మరి. ''ఇంకా ఎంతసేపు కావుడక్కాయ్ దేముడికి చెయ్యిచూపించేసి నువ్వూ పెందలాడే నాలుగుముద్దలు తిని పడుకోవచ్చు గదా'' అంటూ తన అక్కగారికి వినిపించేట్టు గారిగా ఓ కేక పెట్టేవారు. ''ఇదిగో వస్తున్నా వుండరా అబ్బాయ్'' అని 'వీడికెప్పుడూ తొందరే' అని గొణుక్కుంటూ ముసుగు సవరించుకుంటూ గబగబా జపం పూర్తి చేసి నైవేద్యం పెట్టేసేదా పెద్దావిడ. ఏడు పుష్కరాల వయసున్న ఆమెకు డెబ్బయ్యేళ్లకు పైబడ్డ తన 'చిన్న తమ్ముడంటే' తగని ముద్దు.

మా నాయనమ్మ అన్నపూర్ణమ్మ మాత్రం నిజంగా సార్థక నామధేయురాలు. పెళ్లివారి ఇంటిలా వేళాపాళా లేకుండా నిత్యం వస్తూ పోతూ వుండే చుట్టాలకు, ఇంటిని, పొలాన్ని కనిపెట్టుకొని వుండే పనివాళ్లకు విసుగూ విరామం లేకుండా వండడం, వార్చడమే పని. అదేం చిత్రమో గాని, ఆమెచేతితో పచ్చగడ్డి పచ్చడి చేసినా, అది అమృత తుల్యంగా వుండేది.

మా తాతయ్యని వూళ్లో అంతా చిన్నశాస్త్రి గారనీ, చిన్నబ్బాయిగారనీ పిలిచేవారు. నిండైన విగ్రహంతో ఠీవిగా వుండేవారు. వయసులో వున్నప్పుడు హాకీ, బ్యాడ్మింటన్ క్రమం తప్పకుండా సాధన చేసిన శరీరం కావడంతో దృఢంగా, ఆరోగ్యంగా వుండేవారు. ఆయనకి హోమియో వైద్యంలో ప్రావీణ్యముంది. తనకొచ్చిన విద్యను మరుగున పడనీకుండా, పేదలకు వైద్యం చేయడంతో బాటు ఉచితంగా మందులు ఇచ్చేవారు. దీనికి తోడు ఆయనకు పాము మంత్రం, తేలు మంత్రం తెలుసు. మా ఊరు కొండప్రాంతం కావడంతో పురుగూ పుట్రా తిరిగేవి. దాంతో, పాము కరిచిన వాళ్లేగాక, పురుగు ఊది వంటినిండా దద్దులు వచ్చాయనీ, చేలల్లోంచి అడ్డంగా పడి నడిచి వస్తుంటే చూసుకోకుండా పామును తొక్కామనీ... ఇలా రకరకాలయిన వాళ్లు అర్ధరాత్రి అపరాత్రి తేడా లేకుండా వచ్చి ఇంటి తలుపులు కొట్టేవారు. ఆయన ఏ మాత్రం విసుక్కోకుండా బావి దగ్గరకెళ్లి నీళ్లు తోడుకుని తలమీద ఓ చేదెడు నీళ్లు పోసుకొనొచ్చి వారిని చిరునవ్వుతో పలకరించేవారు. వారిలో పాము కరిచిన వారికి మంత్రం వేసేవారు. దద్దులు వచ్చినవారికి దురాయిలు కట్టేవారు. పగబడుతుందన్న భయం వున్న వారికి ఇసుక మంత్రించి ఇచ్చేవారు. ఆయన దగ్గరకు వైద్యంకోసం జబ్బుపడ్డ పశువులను కూడా తీసుకొచ్చేవారు. తాతయ్య మంత్రమహిమో, లేక ఆయన మీద వున్న గురి వల్లనో, చాలా చిత్రంగా పాము కరిచినవారు కొద్దిసేపటికల్లా నయం అయి లేచి చక్కా నవ్వుకుంటూ వెళ్లేవారు. ఆ తర్వాతెప్పుడో వాళ్లు ఆయన దగ్గరకొచ్చి 'మా దొడ్డో కాసినియ్యి వుంచండి అంటూ సొరకాయలో, కాసిని చిక్కుడు కాయలో, కాకరకాయలో లేకపోతే జున్నుపాలో ఇచ్చెళ్లేవారు. ఆ మాత్రం దానికే ఆయన మహదానందపడిపోయేవారు.

పాముమంత్రం వేసేవారు పాటించవలసిన నియమాలు కొన్ని వున్నాయి. పొట్లకాయ తినగూడదు; పామును కొట్టకూడదు, చంపకూడదు, సరికదా, భోజనం చేసేటప్పుడు 'పాము' అన్న మాట వినబడితే ఆ పూట ఇక భోజనం చేయకూడదు. ఈ నియమాల వల్ల పాపం ఆయనకు ఎంతో ఇష్టమైన పొట్లకాయ పెరుగు పచ్చడిని శాశ్వతంగా వదులుకోవలసి వచ్చింది. అలాగే అప్పుడప్పుడు ఆయన అన్నం తినేటప్పుడు ఈ విషయం మర్చిపోయి మేమెవరో ఒకరం 'పాము'ల కబుర్లు చెప్పుకుంటూ తాతగారి సంగతి గుర్తుకొచ్చి నాలిక్కరుచుకునేవాళ్లం. ఏం లాభం! అప్పటికే ఆయన ఉత్తరోపాశన పట్టేసేవారు. అలా చేస్తే ఆ పూటకిక అన్నం తినడానికి వీల్లేదు. తాతయ్య మంచి భోజన ప్రియుడు. రుచులన్నీ తెలిసినవాడు. మా నాయనమ్మ ప్రతిరోజూ ఆయన్ను రేపు 'ఏం కూర చేయమంటారు?' అని అడిగి కనుక్కోనిదే సొంతంగా మాత్రం చేసేది కాదు. ఆమె అలా అడిగినప్పుడల్లా ''ఆఁ రోజూ నేను చెప్పేదేంటోయ్? నీకు తోచిందేదో చెయ్యరాదూ'' అంటూనే వంట చేసేప్పుడు గుమ్మంలో కూర్చుని వంటలో ఆమెకు సూచనలు జారీచేసేవారు. 'ఏమోయ్! ఏమిటీ, టమోటా పచ్చట్లో కొత్తిమీర మరికొంచెం వేస్తే బావుంటుంది. ''ఆ.. ఆ.. ఆగు ఆ పోపుగింజలు మరీ ముట్టించి వేస్తున్నావు మరికాసిని వేస్తే నీ సొమ్మేం పోతుంది? అదిగో, మాడువాసన రాకమునుపే ఆ తిరగమోతేదో పెట్టు. పులుసులో ఇంగువ అట్లా విదిలించకు, కనీసం శనగ్గింజంతన్నా వేయకపోతే సువాసన రాదు''– ఇలా వుండేది ఆయన వరుస.

ఇక ఇంటికి వచ్చిన అతిథులకు మాత్రం దగ్గరుండి దేనికీ లోటులేకుండా వడ్డన జరిగేలా చూసేవారు. వెండికంచం నిండా వడ్డించిన పదార్థాలన్నింటినీ చూసేసరికి ఏది ముందు కలుపుకోవాలో, ఏది తర్వాత కలుపుకోవాలో అర్థంగాక దిక్కులు చూస్తుంటే,–''ఏమిటయ్యా అట్లా కెలుకుతావు, ఈ వయసులో అట్లా పిట్టతిండి తింటే ఇంక బలం ఎక్కణ్ణించి వస్తుంది? నీ యీడులో వున్నప్పుడు నేను వీశెడు వంకాయ కూర తినేవాణ్ణి'' అని చెబుతూనే, ''ఇదిగో ఇక్కడ అరటికాయ కూర వడ్డించండమ్మా, ఆఁ ఏమంటావూ, బొత్తిగా నెయ్యి తినకబోతే ఎట్లా? మనమెల్లాగూ మాంసం తినం కదా; మామిడికాయ పప్పులో నాలుగ్గరిటలయినా నెయ్యి కలపాలి, దానికి జతగా ఊరు మిరపకాయలు, అప్పడాలూ, వడియాలూ నంజుకుంటే ఆహా ఆ రుచే వేరు. ఏంటట్లా దద్దరిస్తున్నావు, మీ అత్తయ్య చేసిన మజ్జిగ పులుసు ఒక్కసారి రుచి చూశావంటే మళ్లా మా ఇల్లు వెతుక్కుంటూ రావలసిందే. అంత అద్భుతంగా చేస్తుందావిడ'' అంటూ మాటల్లో పెట్టి పొట్ట పగిలిపోయేట్టు తినిపించేవారు. భోజనాలవగానే ఈనెలు తీసి శుభ్రం చేసి వుంచిన లేత తమలపాకుల్లో పచ్చకర్పూరం, జాజి పువ్వు, లవంగ మొగ్గ, యాలకపండు, కర్జూరం పొడి, వక్క పలుకు పెట్టి ఇచ్చేవారు. ఇహ ఆయన భోజనం చేస్తుంటే మాకు భలే చూడబుద్ధయ్యేది. అరటాకు ఆకారంలో వున్న వెండి విస్తట్లో పొగలు కక్కే అన్నం, అందులో కలగలుపు పప్పు, అప్పుడే రోటిలోంచి తోడిన పచ్చడి, వేపుడు కూర ఒకటి,

తాలింపు పెట్టిన కూర ఒకటి, ఊరగాయ పచ్చడి, పులుసు, చారు, కమ్మని పొడి, ఊరు మిరప కాయలు, ఘుమఘుమలాడే నెయ్యి, గడ్డపెరుగు... దానితోబాటు ఏ కాలంలో ఆ కాలానికి తగ్గ పండు వుండాల్సిందే. విస్తరిలో వడ్డించిన పదార్థాల న్నింటినీ పిసరంత కూడా మిగిల్చిపారేయకుండా శుభ్రంగా కడిగి తుడిచినట్టు తినేవారు. మమ్మల్ని కూడా అట్లానే తినమనేవారు.

ఇక పండుగలొచ్చాయంటే మాత్రం మా ఇంట్లో చాలా సందడిగా వుండేది. దర్జీని ఇంటికే పిలిపించి కొలతలు ఇచ్చి మా అందరికీ కొత్త బట్టలు కుట్టించేవారు. పిండివంటలు ఏం చేయించాలో పిల్లలనే అడిగి, వారికిష్టమైనవే చేయించేవారు. అందరిలోకీ నేనంటేనే తాతయ్యకు ఎక్కువ ఇష్టం. అందుకే నాకిష్టమైన మైసూర్‌పాకు, నేతి అరిసెలు, బెల్లపు గవ్వలు, కజ్జికాయలు, చిట్టిగారెలు, సొర కాయ లేదా బూడిదగుమ్మడికాయ హల్వా వంటి తీపి వంటకాలు తప్పనిసరిగా వుండితీరేవి.

పండగలన్నింటిలోనూ దీపావళి పండగంటే మాకు చచ్చేంత ఇష్టంగా వుండేది. ఇంట్లో అందరూ టపాకాయలకి రూపాయి కూడా తగలే సేది లేదంటూనే ఎవరికి వాళ్లు ఒకరికి తెలియ కుండా ఒకళ్లు సంచులనిండా బాణాసంచా తీసుకొ చ్చిపడేసేవారు. 'జాగ్రత్తగా కాల్చు మళ్లా తాతయ్య కంటబడితే మాకు తిట్లొస్తాయి' అంటూ చల్లగా జారుకునేవారు బాబాయిలు. మేము తాతయ్య లేకుండా చూసి టపాసులు కాల్చడం మొదలుపె ట్టగానే ఎక్కడినుంచో వచ్చి మా దగ్గరకు చేరే వాడాయన. దీపావళి పండగ సీజన్లో మాత్రం కాళ్లకు చెప్పులు వేసుకోకపోతే ఆయన చచ్చినా వూరుకునేవాడు కాదు. కాళ్లు కాల్తాయని భయం. బాణాసంచా కాల్చేటప్పుడు తప్పనిసరిగా పాత బట్టలు వేసుకోవాల్సిందే. తిట్లు మాత్రం నాన్నకే ఎక్కువ పడేవి. "ఏరా కిష్టీ ఏళ్లొస్తున్నా బుద్ధిలేదు. అన్నీ కాళిదాసు పన్లు చేస్తావు. చిచ్చుబుడ్లు అట్లా చేతుల్లో పెట్టుకుని కాలుస్తారా, అదుగో నే చెబు తూనే వున్నానా, ఆ ఔటు ముట్టిచ్చగానే ఇవతలికి వచ్చేయకుండా అట్లా వంగి, దాని మొహంలో మొహం పెడితే అంతే అవుతుంది మరి" అంటూ మెత్తమెత్తగా చివాట్లేసేవారు. దీపావళి రోజు బాగా పొద్దుపోయాక తుపాకీ, తూటాలు తీసుకుని మేడ మీదికెళ్లిపోయేవారు. దాదాపు నాలుగున్నర అడు గుల పొడుగున్న తుపాకీ అది. ఆయన వయసులో వున్నప్పుడు దొంగల్ని పట్టిచ్చినందుకుగాను జిల్లా పోలీసు అధికారి నుంచి బహుమతిగా వచ్చింది. అందులో తూటాలు పెట్టి నాలుగైదు దఫాలు గాలిలో కాల్చేవారు. ఆ దృశ్యం చూడ్డం మాకే కాదు, ఊళ్లో అందరికీ సరదాగానూ, భయంగానూ వుండేది.

★ ★ ★

తను బతికున్నన్నాళ్లూ కొడుకులెవరూ వేరు కుంపటి పెట్టకుండా అంతా ఉమ్మడిగా వుండాలని తాతయ్య పట్టుదల. ఇంట్లో అందరూ రాజుగారి గంగాళంలో పాలు పోసినట్టు చేసేవారు. సంపా దించి ఆయన చేతికి ఇచ్చిన దానికంటే ఖర్చుపెట్టు కునేదే ఎక్కువగా వుండేది. దాంతో ఆయన చివరి రోజుల్లోకొచ్చేప్పటికే ఆస్తంతా హారతి కర్పూరమై, కుటుంబ పరిస్థితి ఆరు తీసి మూడు కలుపు అన్నట్టుగా తయారైంది. అయినా ఆయన అవేవీ ఖాతరు చేయకుండా తను మాత్రం 'ధర్మప్రభువులు' అన్న పేరు మిగిలించుకుని మహారాజులా దర్జాగా వెళ్లి పోయారు కానీ, ఆ తర్వాత మిగిలిన వాళ్ల పరిస్థితి మాత్రం ఇంగువ కట్టిన గుడ్డలా తయారైంది. మా హయాంలోకొచ్చేసరికి మరీ.... దాంతో నాన్నగారు కూడా పోయాక అప్పుడప్పుడే రెక్కలు మొలిచిన మేమంతా ఇంక అక్కడ వుండలేక ఎవరికి వాళ్లు ఉద్యోగాల రీత్యా ఈ మహానగరంలో స్థిరపడిపో యాము. ఇప్పుడు వూర్లో మాకేముందో ఎవర యినా చెబితే తప్పితే మాకే తెలియని పరిస్థితి. ఇక "మీకేమన్నా ఆస్తిపాస్తులున్నాయా బాబూ" అనడిగే ఆడపిల్లల తల్లిదండ్రులకు ఏం చెప్పగలం?" అందుకే వినపడనట్టు నటించడమో, లేకపోతే నిజాయితీగా విషయం చెప్పుకోవడమో చేయాలి కాబట్టి నేను మాత్రం లౌక్యంగా "లేకేం, వున్నాయ నుకోండి, ఏమన్నా కొద్దోగొప్పో వున్నా మేము పట్టించుకోం, ఉద్యోగమే నా ఆస్తి" అని ఎప్పుడూ చెప్పే మాటే ఇప్పుడూ చెప్పాను. వాళ్లు కూడా ఏమనుకున్నారో ఏమో, "అబ్బే! మీకేమున్నాయ న్నది మాకక్కరలేదండీ, ఏదో భార్యను పోషించు కునేపాటి ఉద్యోగం వుంటే చాలు, మీ జాతకం కాయితం ఇవ్వండి, కుదిరితే మేమే తెలియజేస్తాం" అంటూ లేచారు.

ఇక వారి నుంచి వచ్చే శుభ వర్తమానం కోసం ఎదురుచూస్తూ హుషారుగా గడిపేస్తున్నాను. ఆ తీపి కబురు ఎప్పుడొస్తుందో మరి! ★

# నీవెవరు?

– వి మధువాణి

అక్షరాల సొగసుతో,
ఛందస్సుల సుగంధాలతో,
యతి ప్రాసల పరువాలతో,
రసికుల గుండెల్లో గుబులు రేపే
సోయగాల రెమ్మా...
నీకెన్ని కళలు... ఎన్ని 'సు' గుణాలు!
'క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్'
రీతిన ఘడియకొక్క రూపమెత్తుతావు.
మబ్బుల మరీచికవో, కరిగే ఇంద్రచాపమో...
రెప్పపాటులో మాయమయ్యే రంగుల కలవో...
కలవరపెట్టి కవ్విస్తావు...
ఇంతకీ ఎవరివి నీవు?
ప్రళయకాల ప్రభంజనంలా చెలరేగి,
లోకాన పేరిన కుళ్ళుని కూకటి వేళ్ళతో పెకిలిస్తావు.
మరుక్షణాన ప్రణయమూర్తివై,
మల్లెల పరిమళంలా కమ్ముకుంటావు.
రసజగతిలో ఊయలలూపుతావు.
భావావేశంతో కుదిపేస్తావు.
వసంత యామినివై కైపెక్కిస్తావు
పదకేళి విలాసంతో మురిపిస్తావు...
అంతలోనే ఆధునిక అవతారమెత్తి
అర్థం కాని భాషతో, భావాలతో
భయపెట్టి వికటంగా నవ్వుతావు.
మాయలేడివో – మాయలాడివో...
తెలీక తెల్లబోయి చూస్తాను
తెలిసే లోగా, చల్లని తల్లివై
మెత్తని మాటలతో లేడి కన్నులని తుడుస్తావు
వేదనలో వెన్నెలవై వస్తావు,
మమతలొలికే అమృతవర్షిణివై పలుకుతావు
జీవన వేణువులూదే సంజీవనివై కరుణిస్తావు
ఇంతకీ ఎవరివి నీవు?
శ్రీశ్రీ 'అగ్గిపుల్ల'వా... అల్లసాని 'వరూధిని'వా
'మో' 'ఏమో'వా... తిలక్ 'వెన్నెల్లో ఆడపిల్ల'వా?
ఇంతకీ ఎవరివి నీవు?